manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 211 | మంగళవారం | 28.01.2025



# నమూనాతోనే సరి..!

- 18 నెలలైనా.. అతి గతి లేదు
- శిలాఫలకానికే పరిమితమైన హరిత హోటల్

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో రూ.25 కోట్లతో హరిత హోటల్ ను నిర్మించాలని గతేడాది ఆగస్టు 25న అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నిధులను కూడా మంజూరు చేసింది. హైదరాబాద్‌లో అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హోటల్ నిర్మాణ నమూనాలు, చేపట్టే పనులపై సంబంధిత టూరిజం శాఖ అధికారులతో చర్చించారు. నమూనాలను కూడా విడుదల చేయించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు హరీష్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ శిలాఫలకాలను లాంఛనంగా ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు 18



నెలలు పూర్తయిన హోటల్ నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఒక్క ఇటుక రాయి కూడా పడలేదు. ఈ చారిత్రక ప్రాంతంలో హోటల్ నిర్మాణం వల్ల సోమేశ్వరాలయంకు వచ్చే యాత్రికులు, భక్తులు బస చేయడానికి అనుకూలంగా ఉంటుందని భావించారు. కానీ వారి ఆశలు అందరిని ద్రాక్ష గానే మిగిలాయి. ఇప్పటికైనా ప్రస్తుత ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి నిర్మాణ పనులు చేపట్టేలా చొరవ తీసుకోవాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యేను వివరణ కోరగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని సమాధానం ఇచ్చారు.




## చేర్యాల స్పెషల్ ఆఫీసర్‌గా అబ్దుల్ హమీద్


చేర్యాల మున్సిపాలిటీ సంబంధించిన పాలకవర్గం కాల పరిమితి ఆదివారం ముగియడంతో సోమవారం నుంచి స్పెషల్ ఆఫీసర్ గా సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్‌న నియమితులయ్యారు. ఇందులో భాగంగా సోమవారం రోజు స్పెషల్ ఆఫీసర్ గా ఆయన పూర్తి బాధ్యతలు స్వీకరించారు. **- మన చౌరాస్తా, చేర్యాల**



2 లో

## ప్రజావాణిపై నిర్లక్ష్యం వద్దు

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



## కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

2

- రైల్వే జీఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యేలు



## పదవి లేకున్నా ప్రజాసేవలో ఉండాలి

3

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



## ఎమ్మెల్యే పల్లాపై దాడి సరికాదు

2

- కాంగ్రెస్ దాడిని ఖండించిన సీపీఎం

General News



# ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను సూచించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలన్నారు. అదే విధంగా ఫిర్యాదులు పెండింగ్ లో లేకుండా సత్వరమే పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

**పాలకుర్తి మండలం** దుబ్బతండా గ్రామానికి చెందిన బానోత్ బుజ్జి పాలకుర్తి రిజర్వాయర్ లో ముంపునకు గురైన తన పట్టా భూమి సర్వే నంబర్ 278లో 2 గుంటల భూమికి సంబంధించిన నష్ట పరిహార డబ్బులు ఇప్పించాలని దరఖాస్తు చేశారు.

**జనగామ మండలం** ఎర్రగొల్లపహాడ్ గ్రామానికి చెందిన సబ్బని పాండు తన 11 గుంటల భూమి పట్టా మార్పిడి కోసం వినతిపత్రం సమర్పించారు.

**లింగాలఘనపురం మండలం** జీడికల్ గ్రామానికి చెందిన కెంగర్ల అజయ్ 23.092024 రోజున ఎంసీహెచ్ లో ల్యాబ్ అటెండెంట్ గా దరఖాస్తు చేశారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితాలో మూడవ వ్యక్తిగా ఎంపికయ్యారు. కానీ తుది జాబితాలో పేరు రాలేదు. కావున ఈ విషయమై న్యాయం చేయగలరని కోరుతూ దరఖాస్తును సమర్పించినారు.

**జాఫర్‌గఢ్ మండలం** తీగారం గ్రామానికి చెందిన మండల గట్టుమల్లు, కొనుగోలు చేసిన తన భూమి సర్వే నంబర్ 361లోని 133 గుంటల భూమి, సర్వే నంబర్ 362లోని 020 గుంటల భూమిలో సాగు చేసుకుంటున్న భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారి పేర్లను తొలగించి తమ పేరు మీదకు పట్టా ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మనవి చేశారు.

**రఘునాథపల్లి మండలం** కన్నాయిపల్లి గ్రామానికి చెందిన పి.సోమిరెడ్డి కరెంట్ బిల్లు సబ్సిడీ జీరో రావడం లేదు అంటూ అర్జీ ద్వారా కోరారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మొత్తం 42 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారానికై అన్ని మండలాల సంబంధిత తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జనగామ, ఘనపూర్ (స్టేషన్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీవోలు గోపీరాం, వెంకన్న, డిడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డిఎఓ రామారావు నాయక్, సీపీఓ పాపయ్య, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ వసంత, డీపీఓ స్వరూప పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పల్లాపై దాడిని ఖండించిన సీపీఎం

- **ఏకపక్షంగా వ్యవహరించిన జనగామ సీఐని సస్పెండ్ చేయాలి**

**చేర్యాల, మన చౌరాస్తా :** ప్రజాపాలనలో భాగంగా జనగామ మండలం ఎర్రకుంట తండాలో జరుగుతున్న గ్రామసభలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం, వారి కార్యకర్తలను గాయపరచడం కాంగ్రెస్ పార్టీ పిరికిచర్య అని, అప్రజాస్వామికమని దీనిని సీపీఎం జిల్లా కమిటీ ఖండిస్తుందని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం జరిగిన సీపీఎం సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా ఏ గ్రామానికి ఆ గ్రామంలో జరగాల్సిన గ్రామసభలకు ఇతర గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తరలించి ప్రతిపక్షాలపై దాడులు చేయించడం వారి చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. ఈ దాడుల కు నాలుగు సార్లు పోటీ చేసి ఓడిపోయి ఓటమిని జీర్ణించుకోలేని కొమ్మూరి ప్రతాపరెడ్డి దాడులకు కుట్రలు పన్నుతున్నాడని ఇందులో భాగమే నరసాయపల్లి లో జరిగిన ఘటన, అదేవిధంగా ఎర్రగుంట తండా లో జరిగిందని ఈ విధంగా ప్రజల సమస్యలు పరిష్కరించకుండ దాడులు చేయిస్తే ప్రజలు క్షమించరని తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఇలాంటి ఘటనలకు కారణమవుతున్న కొమ్మూరు ప్రతాపరెడ్డి పై కాంగ్రెస్ నాయకులు విచారణ జరిపి తగిన



చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పై దాడి చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.ఈ దాడి జరుగుతుంటే అక్కడ విధులు నిర్వహిస్తున్న జనగామ సీఐ దాడి చేసిన కాంగ్రెస్ నాయకుల పై చర్యలు తీసుకోకుండా డ్యాన్సులు చేయించి అధికార పార్టీకి కొమ్ము కాస్తున్న సీఐ పై చర్యలు తీసుకోవాలని,వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం చేయాలని అడిగితే ప్రతిపక్షాలపై దాడులు చేస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందన్నారు.ఈ సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య,గొడ్డుబర్ల భాస్కర్,జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెకట్ మావో,ఆలేటి యాదగిరి,బండకింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్,చొప్పరి రవికుమార్,అత్తిని శారద,సింగిరెడ్డి నవీన,జాలిగపు శిరీష,అమ్ముల బాల నరసయ్య పాల్గొన్నారు.



# రైల్వే జీఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** కాజీపేట బస్ స్టాండ్ ఏర్పాటు , కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషి చేయాలని ఎంపీ, ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. రైల్వే జీఎం ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య , ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి , నాయిని రాజేందర్ రెడ్డి కలిశారు. రైల్వేస్టేషన్ నుండి బోడగుట్ట వైపున ఫుట్ ఓవర్ బ్రిడ్జిని , రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డు అండర్ బ్రిడ్జిని మంజూరు చేయాలని కోరారు. సికింద్రాబాద్ రైల్వే భవన్ లో సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ జీఎం అరుణ్ కుమార్ జైన్, డీజీఎం ఉదయ్ నాథ్ కోట్ల తో సమావేశం అయ్యారు. బస్టాండ్ కోసం ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కాజీపేట విస్తృతమైన రైల్వే కనెక్షన్‌లతో కీలకమైన జంక్షన్, కాజీపేట అని పేర్కొన్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులకు సేవలు అందిస్తుందని తెలిపారు. రైలు ప్రయాణాల తర్వాత వారి స్వస్థలాలకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సులపై ఆధారపడతారని, ఈ బస్టాండ్ వ్యాపారస్తులు, ఉద్యోగులు, విద్యార్థులు , చిన్న తరహా పరిశ్రమల వారి రోజువారీ ప్రయాణానికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. కాజీపేట ప్రధాన రహదారి వెంట ఉన్న రైల్వే స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకి కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం నూతన బస్ స్టేషన్ నిర్మాణానికి నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉందని తెలియాజేశారు. బోడగుట్ట ప్రాంతానికి దాదాపు ఒక కి.మీ దూరంలో ఉన్న ప్రసిద్ధ దర్గా హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ ఉందని తెలిపారు. భారతదేశం నలుమూలల నుండి వేలాది మంది ప్రజలు ఈ దర్గాను సందర్శిస్తారని తెలియజేసారు. రైల్వేస్టేషన్ నుండి బోడగుట్ట వైపున ఫుట్ ఓవర్ బ్రిడ్జిని , రైల్వే సమీపంలోని రోడ్డు అండర్ బ్రిడ్జిని మంజూరు చేయాలని రెల్వే జీఎంని అభ్యర్థించారు. ఖాజిపేట ప్రజల కోరిక కాజిపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనీ కోరారు. ఈ సందర్భంగా పై అంశాలపై జీఎం అరుణ్ కుమార్ జైన్ సానుకూలంగా స్పందిస్తూ కాజీపేటలో బస్టాండ్ నిర్మాణానికి స్థల కేటాయింపు విషయాన్నీ పరిశీలిస్తానని, అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ , రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి అతి త్వరలో మంజూరు చేసేందుకు కృషి చెస్తానని తెలిపారు.



# జనగామ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా పింకేష్ కుమార్ బాధ్యతలు

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం పురపాలికల అదనపు బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో జనగామ మున్సిపల్ ప్రత్యేకాధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పురపాలిక ప్రత్యేకాధికారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Local News



# పదవి లేకున్నా ప్రజాసేవలో ఉండాలి

**ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**చేర్యాల, మన చౌరాస్తా :** నాయకులు పదవి లేకున్నా ఎల్లప్పుడు ప్రజాసేవలో ముందు ఉండాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వ ర్ రెడ్డి అన్నారు. చేర్యాల మున్సిపల్ కౌన్సిల ర్లు ఐదేళ్ల పాలన గడువును ముగించుకున్న సందర్భంగా వీరభద్ర గార్డెన్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ నాగేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాలకమండలి వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై మా ట్లాడారు. ఐదేళ్లుగా మున్సిపల్ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు ఎంతో కృషి చేశారని అన్నారు. పదవి కాలం ముగిసిన ప్రజాసేవ లో భాగస్వాములు కావాలని రాజకీయం శాశ్వతం కాదని ప్రజల హృదయాలను గె లుచుకోవాలని నిరంతరం ప్రజల్లో ఉన్నవాడే గొప్ప నాయకుడని అన్నారు. గడచిన ఐదు సంవత్సరాల్లో ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందించినందుకు చైర్మన్ కు కౌన్సిలర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపాలి టీలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేసిందని, చేర్యాల మున్సిపాలిటీకి కూడా పది కోట్లు నిధులను మంజూరు చేశామని అన్నారు. చేర్యాలను రెవిన్యూ డివిజన్ గా ప్రకటించేంతవరకు నా శాయశక్తుల కృషి చేస్తానని, భవిష్యత్తులో ఏ పార్టీతో సంబంధం లేకుండా నాలుగేళ్లు ప్రజలకు ఆరోగ్య సమస్యలను కచ్చితంగా మా హాస్పిటల్ ద్వారా తీరుస్తామని, నిధుల కేటాయింపులో పార్టీల విభేదాలు లేకుండా చూస్తానని, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తా నని అన్నారు. మున్సిపల్ చైర్మన్ స్వరూప రాణి, వైస్ చైర్మన్ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో తమకు సహకరించిన కౌన్సిలర్లకు, పాలకవర్గ సిబ్బందికి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కౌ న్సిలర్లు మంగోల్ చంటి,చెవిటి లింగం,ఆ డెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్,ముస్త్యాల తార,ఉడుముల ఇన్నమ్మ, యాట కనకవ్వ, సందుల సురేష్, తుమ్మలపల్లి లీల, జుబేదా ఖతూమ్ లను ఎమ్మెల్యే, కమిషనర్లు సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆప్షన్ హాలిడేపై అయోమయం!

**జనగామ, మన చౌరాస్తా :** ముస్లింల పండగ షబ్ ఈ మిరాజ్ ఆప్షనల్ హాలిడే పై జనగామ విద్యాశాఖలో అయోమయం నెలకొంది. విద్యాశాఖ అధికారుల సమన్వయ లోపమో.. అవగాహన రాహిత్యమో తెలియదు గానీ జిల్లాలోని చాలా మండలాలు ఆప్షనల్ హాలిడే ను ప్రకటించుకోగా కొన్ని మండలాలకుమాత్రం ఆప్షనల్ హాలిడే ప్రకటించకపోవడం పట్ల ఉపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై విద్యాశాఖ అధికారి రమేశ్ను వివరణ కోరగా ఆప్షన్ హాలిడేపై ప్రైమరీ, యూపీఎస్లకు సంబంధిత ఎంఈవో, హైస్కూళ్లకు అక్కడి హెచ్ఎంలు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. స్కూల్ క్యాలెండర్ ప్రకారం ఉండే సెలవులను వారు నిర్ణయించుకుని ఆప్షన్ హాలీడే ఇచ్చుకుని డీఈవోకు సమాచారం ఇస్తారని తెలిపారు.

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా

**బచ్చన్న పేట ,మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలం కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ వార్డ్ మెంబర్ , సీనియర్ కార్యకర్త రిక్కల రాజు అమ్మ రిక్కల బచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసు కున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అక్కడికి చేరుకొని బుచ్చమ్మ చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలం కేంద్రానికి చెందిన బొచ్చు బాల్ లక్ష్మి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబాన్ని గుర్తించి మృతురాలి కుటుంబానికి బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ , బీఆర్ఎస్ నాయకుడు బొంగు రాజేందర్ రెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబానికి తనవంతుగా ఆర్థిక సహాయం అందించాను. ఆపదలో ఉన్న వారికి నా వంతు సహాయ కారంగా సహాయం అందించడంలో ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కొమురవెల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యులు సిలివేరు సిద్ధప్ప, కొమురవెల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గొల్లపల్లి కిష్టయ్య, ముత్యం నర్సింహులు గౌడ్, ఏర్పుల మహేష్, కొండ శ్రీధర్, సార్ల సురేష్, సిలివేరు కనకమల్లేశ్, గజ్జె వెంకటేష్ పాల్గొన్నారు.





## అన్ని పాఠశాలలను పర్యవేక్షించాలి

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలోని అన్ని పాఠశాలలను సందర్శించి, పర్యవేక్షించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి అనంతరం జిల్లా, మండల స్థాయి అధికారులందరితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నాలుగు సంక్షేమ పథకాలు కోసం చేపట్టిన క్షేత్రస్థాయి సర్వే పరిశీలన, డేటా ఆన్లైన్ నమోదు, గ్రామ/వార్డు సభల నిర్వహణలో సమర్థవంతంగా పనిచేసి, విజయవంతం చేసిన జిల్లా, మండల స్థాయి అధికారులందరికీ అభినందనలు తెలియజేశారు. అలాగే వచ్చే ప్రజావాణి నుంచి ఈ నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా గురుకులాల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి ప్రవేశాలకు గాను 60 వేల సీట్లకు ఫిబ్రవరి 23న ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశాలకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేది ఫిబ్రవరి 1 అని, అందుకు తగ్గట్లుగా ప్రతి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శులచే పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు.



## భయంతో కాంగ్రెస్ దాడులు

**చేర్యాల, మన చౌరాస్తా :** ప్రజా పాలనలో ప్రశ్నిస్తున్నారని భయంతోనే కాంగ్రెస్ దాడులకు పాల్పడుతుందని బీఆర్ఎస్ చేర్యాల పట్టణ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వరరావు, నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, పురుమ వెంకటరెడ్డి అన్నారు. టీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ జనగామ మండలంలోని ఎర్రకుంట తండాలో జరిగిన సభలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం, పోలీసులు కూడా అధికార పార్టీకి కొమ్ము కాయడం, బీఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జ్ చేసినందుకు ప్రశ్నించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని అరెస్టు చేయడం అప్రజా స్వామికమని అన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడుబి రెడ్డి ఇన్నారెడ్డి, టౌన్ సెక్రటరీ బుర్రగోని తిరుపతి గౌడ్, నాయకులు యాట యాదగిరి, బిక్షపతి, ఇప్ప కాల భాస్కర్, ఔషర్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు

## తుమ్మబాల విద్యార్థికి సన్మానం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** ఓటర్స్ డే సందర్భంగా కలెక్టర్ ఆదేశానుసారంగా డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ అనే అంశంపై నిర్వహించిన మండల స్థాయి వక్తృత్వ (ఉపన్యాస) పోటీలలో తుమ్మ బాల పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని వై. యశస్విని (నక్కవానిగూడెం) ప్రథమ స్థానంలో నిలిచి కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా యశస్వినిని పాఠశాల హెచ్ఎం వై బాల రెడ్డి ,ఉపాధ్యాయులు సిహెచ్.అశోక్ , సి.హెచ్ భాస్కరా చారి, శాంతా, ఫర్జానా, సిస్టర్ ఆరతి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



## జోరు మీదున్న

# మీనాక్షి

గతేడాది కాలంగా ఆమె నటించిన ప్రతి సినిమా సూపర్ హిట్ అయ్యింది. దీంతో ఈ అమ్మడుకు తెలుగు, తమిళంలో వరుస ఆఫర్స్ క్యూ కడుతున్నాయి. ఇటీవలే మరో సక్సెస్ అందుకుంది. దీంతో స్నేహితులతో కలిసి వెకేషన్ ఎంజాయ్ చేస్తుంది. ఆ వయ్యారి మరెవరో కాదండి.. యంగ్ బ్యూటీ మీనాక్షి చౌదరి. ఇటీవలే విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో నటించి భారీ సక్సెస్ అందుకుంది. ఈ సినిమా రూ.300 కోట్ల క్లబ్ లో చేరే దిశగా అడుగులు వేస్తుంది. తాజాగా తన సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న మీనాక్షి ఇప్పుడు ఎడార్లుల్లో విహరిస్తూ మరోకసారి తన తన ఆనందాన్ని రెట్టింపు చేసుకుంది. ఫ్యామిలీతో కలిసి దుబాయ్ వెళ్లిన ఈ ముద్దుగుమ్మ. అక్కడ వీధుల్లో తిరుగుతూ ఎడారిలో విహరిస్తూ ఎంజాయ్ చేస్తుంది. 2025లో ఇది తన మొదటి ట్రిప్ అని కూడా చెప్పకొచ్చింది మీనాక్షి చౌదరి. తాజాగా ఇన్ స్టా ద్వారా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో చాలా వైరల్ గా మారుతున్నాయి. ఇటీవలే లక్కీ భాస్కర్ సినిమాతో హిట్ అందుకున్న మీనాక్షి.. ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మరో సక్సెస్ అందుకుంది. దీంతో ఇప్పుడు ఈ అమ్మడు ఫుల్ జోష్ మీదుంది. అలాగే మీనాక్షి చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంది.



